క్లుప్తంగా

ఘనంగా పారిపల్లెమ్మ పుట్టుక మహోత్సవం



పారిపల్లెమ్మ అమ్మవారి పుట్టుక మహోత్సవం

మునగపాక : వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ అమ్మవారి పుట్టుక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నేల వేషాలు ఏర్పాటు చేశారు. మార్చి 7న వాడ్రాపల్లిలో జరగనున్న పారిపల్లెమ్మ అమ్మవారి పండగ సందర్భంగా పుట్టుక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, కోలాటం వంటి ప్రదర్శనలు అందరినీ అకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, రామజోగినాయుడు, మళ్ల వరహా నరసింగరావు, దశావతారం, నూకప్పారావు, శేషు పాల్గొన్నారు.

ఘనంగా గంగ పరదేశమ్మ తల్లి పండగ

మునగపాక : తోటాడలో మంగళవారం గంగ పరదేశమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సచివాలయం సందర్శించిన ఎంపీడీవో

రాంబిల్లి: ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు పంచదార్ల సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన పంచదార్ల సచివాలయాన్ని సందర్శించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేసారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దీనికనుగుణంగా సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం పంచదార్ల, భోగాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో ఆదేశించారు.

ప్రజా సంఘాల అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

రాంబిల్లి : ప్రజా సంఘాలు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని సీఐటీయూ ఇతర ప్రజా సంఘాల నాయకులు పలు గ్రామాల్లో మంగళవారం పరచారం నిర్వహించారు. కొప్పుగొండుపాలెం, కొండవారపాలెం, నేవీ పునరావాసకాలనీల్లో ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దేముడు నాయుడు, గంగ రాజు, డీఐఎఫ్‌వై నాయకులు నారాయణరావు, శివాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవికి మద్దతుగా ప్రచారం

మునగపాక : ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిని గెలిపించాలని కోరుతూ మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మునగపాక, తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఉపాధ్యాయులను కలిసి చిరంజీవిని గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటకోట విజయ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

6న ఎన్‌సీసీ ఫెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ మురళీరావు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి విద్యా సంస్థల్లో మార్చి 6న నిర్వహించనున్న ఎన్‌సీసీ ఫెస్ట్‌కు సంబంధించిన 'ద్రోణా 23' పోస్టర్‌ను స్థానిక సీఐ మురళీరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి మణికంఠ మాట్లాడుతూ ఫెస్ట్‌లో అగ్నిమాపక డ్రిల్, ఎస్‌డీఆర్ఎఫ్ సాహస కృత్యాలు, ఎన్‌సీసీ కేడెట్స్ పరేడ్, దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. అనకాపల్లి జిల్లాకు చెందిన అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

తంతడిలో ఉచిత వైద్య శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తంతడిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో నూనతంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌లో స్థానిక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి అలేఖ్య, వైద్య సిబ్బంది, సర్పంచ్ మురళీ పాల్గొన్నారు.

భళా..బాలల విజ్ఞాన ప్రదర్శన

- ఉత్సాహంగా సైన్స్ డే
- సి.వి.రామన్‌కు నివాళులు

నక్కపల్లి : సైన్స్‌డేను పురస్కరించుకుని మంగళవారం మండలంలో పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైడ్రాలిక్ క్రేన్ నమూనా, దర్పణాలతో పూల తోట, రెయిన్ అలారం, ఊపిరితిత్తుల పనిచేయు విధానం, తదితర నమూనాలు ఆకర్షణగా నిలిచాయి. వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పర్యావరణ స్పృహతో తయారు చేసిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. ఎయిర్‌కూలర్, వాటర్ అలారం, ఫైర్ అలారం, జీవ వైవిధ్యం, జలచక్రం, నీటి వినియోగం, డ్రిప్ ఇరిగేషన్, కృత్రిమ రోబో వంటి ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు రాణి లలిత, కోడి శ్రీనివాసరావు, ఎస్.వి.ఎస్ ఆచార్యులు, వెంకటరమణ, సత్యవతి, మూర్తిరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలకు పదును

కోటవురట్ల : ప్రతి విద్యార్థి సైన్సు పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఎంఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. మండలంలో జాతీయ సైన్సుడేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో జరిగిన సైన్సు ఎగ్జిబిషన్‌ను ఎంఈవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల మేధస్సుకు ఇటువంటి ప్రాజెక్టులు పదును పెడతాయన్నారు. వారిలోని ఆలోచనలకు సాంకేతిక విజ్ఞానం తోడైతే అద్భుతాలు జరుగుతాయన్నారు. హెచ్ఎం షేక్ ఖాలీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : సైన్స్ ప్రయోగాల వల్ల విద్యార్థులకు మరింత విజ్ఞానం పెరుగుతుందని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిప్రసూన అన్నారు. పాఠశాలలో సైన్స్ పితామహుడు సి.వి.రామన్ జయంతి నిర్వహించారు.



నక్కపల్లిలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



ఉద్దండపురంలో సి.వి.రామన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



తాము తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న ఉద్దండపురం విద్యార్థులు



సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

పాయకరావుపేట : పట్టణంలో గల కె.హెచ్.వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్సు ఎగ్జిబిషన్ నిర్వహించారు. జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా ప్రపంచ శ్రేయస్సు కొరకు ప్రపంచ విజ్ఞాన శాస్త్రం అనే అంశంపై విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన నిర్వహించినట్టు ఉపాధ్యాయురాలు విజయభాను కోటే తెలిపారు. మానవ చర్యలు పర్యావరణహితంగా వుండాలని, భూవనరులు సక్రమ వినియోగం జరగాలని ఈ సంవత్సరానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. భూగ్రహానికి హాని కలిగే విధంగా ఏవిధమైన కార్యక్రమాలు చేయరాదని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు సైన్సు కిట్‌లతో చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులు సి.వి.రామన్ గా నటిస్తూ టిండాల్ ఎఫెక్ట్‌ను ప్రదర్శించడం చేశారు. అదే విధంగా మరో విద్యార్థి సీఎం జగన్‌మోహన్ రెడ్డిలా మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద వలన విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై వివరించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సుందరరావు, పీఈటీ ప్రసాద్ కుమార్, గుర్నాథరావు, శ్రీ చైతన్య స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్సు పరికరాల ప్రదర్శనలు ఎంఈవో గాంధీ పరిశీలించారు.

బాలల సృజనకు దర్పణం

యలమంచిలి : వైజ్ఞానిక నమూనా ప్రదర్శనలు ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మతను వెలికి తీసేందుకు దోహదపడతాయని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ పేర్కొన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు రసాయనిక శాస్త్రం, భౌతిక శాస్త్రానికి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ షేక్ గఫూర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను తెలుసుకొనేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిషికేస్‌దాస్, ఆర్ఐ రమణ, వెంకటరమణ, ప్రకాష్, లోవేశ్వరరావు పాల్గొన్నారు.



రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు



శ్రీ చైతన్య పాఠశాలలో సైన్సు ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో గాంధీ



విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న సీఐ షేక్ గఫూర్

సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి

యలమంచిలి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గీతాంజలి, పూర్ణాసాయి వివేకనంద, కొణతాల, ఉషోదయ, వాగ్దేవి, తదితర ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపక బృందంతో మాట్లాడి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడైన సీతంరాజు సుధాకర్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానానికి ఎంపిక చేశారని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఎంతో ప్రతిష్టాత్మకం అని అన్నారు. పట్టభద్రులంతా సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్(చిన్నా), మాజీ మండలాధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



అధ్యాపకులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

అభివృద్ధికి సహకరించండి



ఎన్నికల కరపత్రాన్ని చూపిస్తున్న మాధవ్ తదితరులు

పాయకరావుపేట : ఉత్తరాంధ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ఉత్తరాంధ్ర పట్టభద్రులు శాసన మండలి సభ్యులుగా ఎన్నికల బరిలో వున్న పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. పట్టణంలో గల బీజేపీ నాయకులు తోట నగేష్ స్వగృహంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున, విద్యావంతులు, పట్టభద్రులు సహకరించాలన్నారు. ఈ నెల 13 న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. అంతకుముందు పట్టణంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎం.నాగమల్లేశ్వరి, బీజేపీ నాయకులు రవిరాజు, ఇంజరపు సూరిబాబు, పెంకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అటు నేహా..ఇటు అనసూయ

- పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవంలో మెరిసిన తారలు

నల్పువరం : ఉదయం భక్తులతో ఆ ప్రాంగణం పులకించింది..సాయంత్రం సెలబ్రెటీలతో సందడి నెలకుంది. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. బుల్లితెర బ్యూటీ అనసూయ కిరాక్ పుట్టించింది. బుల్లెట్ బండి సింగర్ మోహన్ భోగరాజు తన గళంతో ఈవెంట్‌ను తారాస్థాయికి తీసుకువెళ్లారు. జబర్దస్త్ యాంకర్ సౌమ్యరావు తన మాటలతో ఆకట్టుకున్నారు. మండలంలోని తవ్వవానిపాలెం వాసుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న అనసూయ

దర్జీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



యలమంచిలిలో టైలర్స్ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న పిల్లా రమాకుమారి



మాట్లాడుతున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

యలమంచిలి : రాష్ట్రంలో టైలర్ల (దర్జీల) ఉన్నతికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటు నందిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. పట్టణంలో పి. వి.కాంప్లెక్స్ ఆవరణలో యలమంచిలి టైలర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ డే నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త ఇలియాస్ హో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో టైలరింగ్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం నుంచి ఏటా రూ. 10వేలు చేదోడు పథకం ద్వారా అందిస్తోందని అన్నారు. టైలర్లకు ఒక సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎంపీ సత్యవతి నిధులతో మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఉత్తరాంధ్ర టైలరింగ్ అధ్యక్షుడు అతికిన శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో టైలర్స్‌ను గుర్తించిన నాయకులు వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. టీడీపీ హయాంలో టైలర్లను పట్టించుకోలేదని తెలిపారు. సీఎం జగన్ పాదయాత్రలో టైలర్ల సమస్యలను నేరుగా తెలుసుకుని టైలర్లు సంక్షేమానికి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, మాజీ జెడ్పీటీసీ ఆడారి శ్రీధర్ (చిన్నా) మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్ డాక్టర్ త్రినాథ్, మండల టైలర్ల సంఘం అధ్యక్షుడు, వియ్యపు సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టైలర్ల ఆధ్వర్యంలో స్వర్గీయ ఆడారి తులసీరావు నివాళి అర్పించారు. తులసీరావు టైలర్లకు సామాజిక భవనాన్ని ఏర్పాటు చేయాలని అనుకునేవారని, గతంలో టైలర్లకు జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు మంజూరుకు ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

చేదోడుతో దర్జీలకు మేలు

మునగపాక : దర్జీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి పేర్కొన్నారు. వైఎస్సార్ చేదోడు ద్వారా దర్జీలకు మేలు జరుగుతుందన్నారు. అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవ సందర్భంగా గవర్ల అనకాపల్లిలో సమావేశం నిర్వహించారు. శ్రీ వీరభద్ర టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎంపీపీ వెంకట్, సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు బాలాజీ, కోటేశ్వరరావు,షేక్ ఇస్మాయిల్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కుమారస్వామి పాల్గొన్నారు.

పథకం ప్రకారం దళిత యువకుడి హత్య

- దళిత నాయకుల ఆరోపణ
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పాయకరావుపేట : మండలంలో గల పి.ఎల్.పురం గ్రామానికి చెందిన దళిత యువకుడు వడ్లమూరి వీరనాగేంద్ర (22)ను పథకం ప్రకారం హత్య చేశారని, దళిత నాయకులు స్థానిక పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. ఈ యువకుడుని హత్య చేసి కాళ్లు, చేతులు తాళ్లతో కట్టి శరీరానికి రాయి కట్టి పొలం బావిలోనే పడేయడం చాలా అమానుషం అని దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, జెడ్పీటీసీ లంక సూరిబాబు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బోడపాటి శ్రీను పేర్కొన్నారు. యువకుడి హత్య పై పోలీసులు తగు విచారణ చేపట్టి, ఇందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. నాగేంద్ర మృతితో అనాథగా మారిన తల్లికి జీవనోపాధి కల్పించాలని అన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న దళిత నాయకులు

పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించాలి

మునగపాక: తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి సారించాలని మ్యాజిక్ బస్ సంస్థ అకడమిక్ ఎడ్యుకేటర్ పి. ఆనంద్ కోరారు. మునగపాక బీసీ కాలనీలో మంగళవారం మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం విషయంలో పిల్లలు భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండేలా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ ఆళ్ల శ్యామల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మ్యాజిక్ బస్ సంస్థ అకడమిక్ ఎడ్యుకేటర్ ఆనంద్

సీతంరాజును గెలిపించి అభివృద్ధికి సహకరించండి



శ్రీరాంపురం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



పాయకరావుపేట సభలో గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన వ్యక్తి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మంగళవారం పట్టణంలోను, మండలంలో గల శ్రీరాంపురం గ్రామంలోను ఓటర్ల అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉత్తరాంధ్రను పారిశ్రామికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం జగన్ మోహన్ రెడ్డి ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర విద్యపరంగా మరింతగా అభివృద్ధి చెందాలంటే మంచి వ్యక్తి, విద్యావేత్త, మృదు స్వభావి, ఎంతో అనుభవం వున్న వ్యక్తి అయిన సీతంరాజు సుధాకర్‌కు ఘన విజయం చేకూర్చాలన్నారు. అనంతరం ప్రతి ఒక్కరికీ కరపత్రాలను అందించారు. గోడ పత్రికను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించవలసిన బాధ్యత అందరిపైన వుందన్నారు. సమావేశాల్లో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పాయకరావుపేట ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు దేవవరపు రాజేష్‌ఖన్నా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సోషల్ మీడియా ప్రతినిధులు కొంకిపూడి రామకృష్ణ, డి.నానాజీ, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, ధనిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు

ఎస్.రాయవరం : ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌తో రోగి వద్దకే డాక్టర్ వచ్చే కార్యక్రమం జరుగుతోందని అనకాపల్లి జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కె. వీరజ్యోతి అన్నారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో సైతారుపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్ వల్ల ప్రయోజనాలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మంచానికే పరిమితమైన రోగి వద్దకు ఇక్కపై ప్రభుత్వ వైద్యులు నేరుగా ఇంటివద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతి నెలా పరీక్షలు గ్రామంలో చేసి రోగి స్థితిని బట్టి మందులు మార్పు చేయడం వంటివి జరుగుతాయన్నారు. సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యులు శక్తిప్రియ శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లో రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ వైద్యారోగ్యశాఖాధికారిణి వీరజ్యోతి

రూ.2.55 లక్షలకు కొబ్బరి ముక్కల వేలం

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కొబ్బరిముక్కలకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు మంగళవారం ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. విజయవాడ జోన్ డిప్యూటీ ఈవో వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, గురవయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31వ తేదీ కాలపరిమితికి హెచ్చుపాటగా రూ.2.55 లక్షలు ఆదాయం లభించింది. గత ఏడాది నిర్వహించిన వేలంపాట కాలపరిమితి మార్చి 4వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొత్తగా వేలం పాట నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 4తో పాట కాలపరిమితి ముగియడంతో మిగిలిన 26 రోజులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలోనే వేలం పాట నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు

డ్రైనేజీ పనులకు ప్రారంభోత్సవం

మునగపాక: అరబుపాలెం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు తెలిపారు. అరబుపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.4లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీకి ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జితో కలిసి మంగళవారం పనులు ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్ కూర్మారావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఆదర్శ ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారన్నారు. మూడో విడత రైతు భరోసా పంపిణీలో భాగంగా మండలంలోని అరబుపాలెం రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడుల కింద ఏడాదికి రూ.13,500 మేర నగదు అందజేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలందుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ బొడ్డేడ బుజ్జి, వీఏఏ సత్య రవిరాజ్, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



అరబుపాలెంలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుజ్జి